
కె. సరోజిని



**పంకజమ్మకు ఒకటే భయం. రేఖ ఎటువంటివాడిని వివాహం చేసుకుంటుందో అని. కాని వేణు ఆమె మేనల్లుడే కదా।**

రాత్రి పన్నెండు గంటలయింది. నటరాజనృత్య కళామందిర్ భవనంలో, మేడమీద తన గదిలో కూర్చొని శ్రీమతి పంకజమ్మ ముందురోజు తమ నాట్య బృందం అంతా కలిసి అశోక థియేటరులో ఇచ్చిన ప్రదర్శన తాలూకు ఫోటోలు, వాటిలో కొన్ని ముఖ్యమైనవి, బాగున్నవీ ఎంచి, వాటికి ఏయే వాక్యాల్ని రాస్తే సరిపోతాయో ఆలోచిస్తోంది. ఒక ప్రముఖ పత్రిక ఈ ఫోటోలతో కూడిన, నృత్య కళామందిర్‌ను ప్రశంసిస్తూ, దాని ఆదర్శాల నుగ్గడించే వ్యాసాన్ని పంపితే ప్రచురిస్తానంది. అందుకోసమే కళామందిర్ సంస్థ అధిపతి పంకజమ్మ అత్యుత్సాహంతో, వాటిని పరిశీలిస్తోంది.

ఆమెకు బాగా నచ్చిన ఫోటోలు రేఖా వేణూ కలిసి డాన్సు చేస్తూంటే తీసినవి. అందులో రేఖ సౌందర్యం, సౌకుమార్యం అభినయచాతుర్యం బాగా కన్పిస్తున్నాయి. వేణు నాట్యకుశలత కూడా బాగా తెలుస్తోంది. వీ రిద్దరూ కలసి రాధామాధవ మేనకా విశ్వామిత్ర సుభద్రార్జున నృత్యాలు చాలా బాగా చేశారు.

పంకజమ్మకి రేఖ అంటే అత్యంత అభిమానం. కళామందిర్‌లో రేఖ చేరి మూడు సంవత్సరాలయింది. ఆమెకు నాట్యం స్వతస్సిద్ధంగానే వచ్చినట్లుంటుంది. శరీరాన్ని అతి చాకచక్యంగా కదలించడంలోనూ, ముద్రల్ని చక్కగా పట్టడంలోనూ, హావ భావ ప్రకటనలోనూ, రాగ తాళబద్ధంగా అభినయించడంలోనూ, రేఖ ఎంతో సమర్థత ప్రకటిస్తుంది. ముగ్ధ నాయికగా ఒక నృత్యంలోనూ, ప్రౌఢ నాయికగా వేరొక నృత్యంలోనూ అభినయం చూపగల శక్తి ఆమెకే వుంది. కళ కొందరికి పుట్టుక తోనే అబ్బుతుంది. నేర్చుకోవడం, కేవలం సహజ రత్నానికి సానబట్టడంలాంటిది వాళ్ళ విషయంలో. రేఖ నృత్యం అతి స్వాభావికంగా రమ్యంగా ఉంటుంది.

పంకజమ్మకు నలభై అయిదే ళ్లుంటాయి. కొద్దిగా లావెక్కిన శరీరం, ఇప్పుడిప్పుడే కొద్దిగా తెల్లపడుతున్న జుట్టు, కళ్ళజోడు పెట్టుకున్న ఆమె ముఖం గంభీరంగా వుంటుంది. ఆమె నృత్యం చాలా బాగా చేసేది. పదేళ్ళ క్రితం ఆమె భర్త చనిపోవడంతో నృత్య ప్రదర్శన లివ్వడం మానేసి పిల్లలకు నృత్యం నేర్పటానికి పూనుకుంది. పంకజమ్మ భర్త గోపాల్ ప్రఖ్యాత నర్తకుడు.. అతనూ పంపజమ్మ కలిసి దేశమంతటా తిరిగి అనేక వందల ప్రదర్శన లిచ్చి, గొప్ప పేరూ ధనం సంపాదించారు. పంకజమ్మ భర్త పోయిన దగ్గర్నుంచి నటరాజ నృత్య కళా మందిర్ స్థాపించి చాలమందికి నాట్యం నేర్పింది. ఆమె శిష్యులలో గాని, శిష్యురాండ్రలోగాని ఆమెకు నచ్చిన వ్యక్తి ఒక్కరూ ఆమెకు కన్పించలేదు, ఒక్క రేఖ తప్ప.

భరత నాట్యం చేసే, అన్ని లక్షణాలుగల యువతి రేఖ మాత్రమే అని పంకజమ్మకు ఆమెమీద అభిమానం. రేఖను ఒక గొప్ప నర్తకిగా రూపొందించి దేశమంతటా ఆమెచేత ప్రదర్శన లిప్పిద్దామని పంకజమ్మ అభిలాష.

మూడేళ్ళ క్రిందట రేఖ తనొక అనాథననీ, కొద్దిగా నృత్యం వచ్చుననీ, తన వలన ఏదైనా పని చేయించుకుంటూ తనకి నృత్యం నేర్పమనీ, కనీసం తన కొక పనిని చూపించమనీ, పంకజమ్మ వద్దకు వచ్చింది. రేఖను చూస్తూనే పంకజమ్మ ఆమెలో కళాకారిణి కుండవలసిన లక్షణాలన్నీ వున్నాయని గ్రహించింది.

ఆనాటినుంచీ పంకజమ్మ రేఖను కన్న కూతురులా చూసుకుంటూ విద్యను నేర్పింది. నేటికి రేఖ ఇంచుమించు పంకజమ్మ స్థాయికి వచ్చింది. నృత్యంలో అప్పుడే రేఖ ప్రదర్శనాలు అనేక వేల ప్రేక్షకుల మన్ననలు పొందాయి. ఆ క్రితం రోజు రాష్ట్ర గవర్నర్ గౌరవార్థం జరిగిన ప్రదర్శనకు జనం ఇసుకవేస్తే రాలనంతగా వచ్చారు. గవర్నరు గారు రేఖను చాలా ప్రశంసించారు.

పంకజమ్మకు రేఖ విషయంలో ఒకే ఒక భయం వుంది. రేఖకు వివాహం కాలేదు. ఆమె వివాహం చేసుకుంటే ఎటువంటివాణ్ణి చేసుకుంటుందో. ఏమాత్రం తప్పటడుగు వేసినా ఆమె కళకుగల ఉజ్వలభవిష్యత్తు నాశనమై పోతుంది. వీలైనంతవరకూ రేఖను అవివాహితగానే వుంచి ఆమెలోవున్న కళకు తగిన ప్రాశస్త్యం లభించేట్టు చెయ్యాలని పంకజమ్మ కోరిక.

కాని తన కోర్కె కొనసాగడం కష్టమని పంక

(89 వ పేజీ చూడండి)

జమ్మకు తెలుసు. వేణుయొక్క ప్రవర్తనలో అతనికి రేఖమీదగల అభిమానం సుస్పష్టంగా తెలుస్తూనే ఉంది. రేఖయొక్క హృదయవీణాతంత్రులు కూడా వేణుయొక్క అనురాగానికి శృతులు కలుపుతున్నట్లు కనిపిస్తోంది—నిన్నటి ప్రదర్శన జరిగినప్పుడు 'ఆమె' మోహం తల్చుకుంటే!

వేణు పంకజమ్మకు మేనల్లుడు. అతను బి. యే. పాసయి నృత్యకళయందున్న అభిమానంచేత పంకజమ్మ దగ్గిర శిక్షణపొంది, ప్రదర్శన లిచ్చే స్థాయికి వచ్చాడు. వేణూ, రేఖా కలిసి చక్కని నాట్యం చేశారు. వేణుకి రేఖయందు విపరీతమైన అనురాగం జనించింది. నాట్య భంగిమలలో అనేక సారులు ఒకరి నొకరు స్పృశింపవలసి వచ్చినప్పుడు, వేణు శరీరంలో విద్యుత్‌శక్తి ప్రవహించేది. మాటల్లోనూ, చేతల్లోను రేఖయందు ఎంతో అనురాగాన్ని ప్రదర్శించేవాడు. రేఖ అతనికి ప్రోత్సాహాన్ని ఇంతకుముందే ఇచ్చివుంటే అతను తప్పక తన మనస్సులోవున్న వుద్దేశాన్ని బయట పెట్టేవాడు.

రేఖ అన్ని విషయాల్లోనూ చాలా ఉత్సాహంగా వుండేది కాని, వేణు ప్రేమ విషయంలో నిర్లిప్తంగా వుండేది. ఆమె ఆదరణా చూపేదికాదు; నిరాదరణా చూపేదికాదు. మామూలుగా వేణుతో చాలా సరదాగా వుండేది. అతని మీద చలోక్తులు కూడా విసిరేది. కాని వంటరిగా వున్నప్పుడు అతనితో కొత్తవాళ్ళతో మాట్లాడినట్లు మాట్లాడేది. రేఖ యొక్క హృదయకావ్యం వేణు చదవలేక పోయాడు. సరికదా అది ఏ భాషలో వుందో కూడా తెలుసుకోలేకపోయాడు.

ఆక్రితం రోజు జరిగిన ప్రదర్శనలో రేఖ చాలా ఉత్సాహభరితంగా వుండడం గమనించాడు వేణు. ఆమె నాట్యం చేస్తోందనడంకన్నా గాలిలో తేలిపోతోంది అనేటట్లువుంది. తనొక్కర్తేకాక, ప్రేక్షకుల్ని కూడా నాట్యం చేయిస్తోంది. ఆమె మొహంలోని వుత్సాహకాంతిముందు ఫ్లడ్‌లైట్‌లు వెలవెలపోయాయి. ఆమె నృత్యం, సౌందర్యదేవత విశృంఖల విహారం—ఆనంద దేవత అపూర్వ వికాసం వేణు తన ప్రేమ ఫలితాన్ని పరిక్షించుకొనేందుకు ఇంతకన్నా దివ్యమైన అవకాశం వుండదని ప్రదర్శనానంతరం తన అనురాగాన్ని తెలియజేసి ఆమెను తన పాణిగ్రహణం చెయ్యమని కోరాడు.

వేణు ప్రార్థన విని రేఖ కొంతసేపు మౌనంగా వుంది. ఆ ఘడియలు వేణుకు విపరీతమైన బాధను కలిగించాయి. అయినా ఆతృతతో ఆమె నిర్ణయం కోసం నిరీక్షించాడు. రేఖ రెండు రోజులు తను ఆలోచించుకోడానికి వ్యవధి ఇమ్మంది. వేణు అందు కంగీకరించాడు. తనను నిరాకరించలేదని సంతోషించాడు.

పంకజమ్మ వీ రిద్దరి మధ్యా అనురాగస్రవంతి ప్రవహిస్తోందనీ, అది ఇక వీరి హృదయక్షేత్రాలను సుభిక్షంచేసి కోర్కెల పంట పండించగలదనీ, గ్రహించింది కాని తన కేమి తెలియనట్లు నటించింది. రేఖ తనంత తను చెప్పేదాకా ఆమె ఈ విషయం రేఖతో ప్రస్తావించదలచుకోలేదు.

పంకజమ్మ గది బయట అడుగుల చప్పు

# నర్తకి

(23-వ పేజీ తరువాయి)

డైంది. తలుపు తోసుకొని రేఖ లోపలికి వచ్చింది. రేఖకు ఇరవై సంవత్సరాలుంటాయి. విశాలమైన సోగదేరిన కళ్ళతో అంత గుండ్రమూకాక అంత కోలగానూ కాకుండా వున్న మొహంతో ఎంతటి వారినైనా ఇట్టే ఆకర్షించగల శక్తి రేఖకుంది.

రేఖ మొహం చూడగానే పంకజమ్మ కొంత ఆమె స్థితి అర్థం చేసుకుంది. రేఖ మొహంలో ఆందోళనా, విచారమూ, నిరుత్సాహమూ స్పష్టంగా కన్పిస్తున్నాయి.

“ఇంతవరకూ నిద్రపోలేదా? రేఖా!”

“అవునండీ నిద్దర రావడంలేదు.”

---

ఒక లక్షాధికారి తన ఇంట్లో పూచికపుల్లగూడా ఎందుకు దొంగతనం చేయబడలేదో స్నేహితులతో చెబుతున్నాడు.

“దొంగలెవరూ రాకుండా మా కుక్క నెప్పుడూ కాపలా వుంచుతాను. కుక్కనెవరూ దొంగిలించకుండా మా పెద్ద బ్బాయి కాపలా. వాడికి మా ఆవిడ కాపలా, మా ఆవిడ్నెవరూ దొంగిలించకుండా నేను కాపలా.” అని చెప్పాడు ఆ లక్షాధికారి.

కర్లపాలెం మధుసూదనరావు
(వేటపాలెం)

---

“మంచిదానివే! ఎల్లుండి మళ్ళీ ప్రదర్శన వుందికదా, ఆరోగ్యాన్ని సరిగా చూసుకోపోతే ఎలా?”

“నిజమే. కాని, నాకేమీ తోచటం లేదు.... మీతో ఒక విషయం మాట్లాడాలి.”

రేఖ మనస్సులో చాలా వ్యథనుంచుకొని చివరకు అది తనలో ఇముడ్చుకోలేక బయటకు కక్కబోతున్నట్లుగా మాట్లాడింది. పంకజమ్మకు రేఖ అంటే చాలా అభిమానం. రేఖ మనస్సును తేలిక పర్చడం ముఖ్యమని భావించింది ఆమె.

“ఏమిటది?” అని సానునయంగా అడిగింది.

“నేను మొట్టమొదట మీ దగ్గరకు వచ్చినప్పుడు నేను ఏ పరిస్థితుల్లో మీ వద్దకు వచ్చానో పూర్తిగా చెప్పలేదు. నేనొక అనాధననీ, నాకాశ్రయమిమ్మనీ మిమ్మల్ని అర్థించాను. మీరు నా యందు ఎంతో సానుభూతి చూపించి నాకాశ్రయం ఇచ్చారు. మీ ఆదరణలో నా గతజీవితాన్నంతా మరిచి నూతన జీవితాన్ని సృష్టించుకో నారంభించాను. ఈ మూడేళ్లూ నా జీవితంలో స్వర్ణమయకాలంలా గడిచాయి. కళాదేవత ఆరాధనలో నా జీవితం సమర్పించి ధన్య నవుదామనుకున్నాను. అందుకే నా హృదయావేశాలకి తావివ్వకుండా ఈ మూడు సంవత్సరాలు గడిపాను. కాని నాది చాలా దుర్బలహృదయమనీ నా మనస్సు చంచలమైనదనీ, ఉన్నతాదర్శాలను సాధించగల శక్తి నాలో లేదని మొన్న తెలుసుకున్నాను” అని రేఖ నిట్టూర్పు విడిచింది.

పంకజమ్మ మొహంలో చిన్న చిరునవ్వు ఉదయించింది.

“రేఖా! నువ్వు విచారించవలసిన పనిలేదు. నువ్వు బాధపడేది వేణుగురించేకదా! వేణు నీయందు అనురాగంతో ఉన్నాడనీ, మీ యిద్దరూ పరస్పరం ఆకర్షణాశక్తికి లోనవుతారనీ నాకు తెలుసు. అయినా, అందులో వింతేమిలేదు. అది ప్రకృతి సహజం. కళకు కూడా కొంత అనుభూతి అవసరమే. మీ యిద్దరూ కలిసి కళామతల్లిని ద్విగుణీకృతంగా ఆరాధించగలరు.”

రేఖ మొహంలో బాధ ఇంకా స్పష్టంగా కన్పించసాగింది. “నేనూ అదే విధంగా భావించాను. నేను నా నూతన జీవితాన్ని సృష్టించుకోవడానికి వేణు సహకారం లభిస్తుందని ఆశించాను. వేణు కూడా నాయందు చాలా అభిమానం కలిగివున్నాడని నేను కొన్ని రోజులనుండి అతని ప్రవర్తన ద్వారా తెలుసుకోగలిగి, మా యిద్దరి భవిష్యత్తు ఎలా వుంటుందో ఆలోచించుకోసాగాను. ఈ విషయంలో తొందరగా నేనొక నిర్ణయానికి రాదల్చుకోక, వేణుతో నా పరిచయాన్ని అభివృద్ధిచేసుకోలేదు. కాని వేణు ఈ విషయాలు సరిగ్గా ఆలోచించుకోలేదు. మొన్న రాత్రి నన్ను తన భార్య కమ్మని కోరాడు.”

పంకజమ్మ “నువ్వు అందుకు అంగీకరించావా?” అని అడిగింది.

“అప్పటి నా స్థితి అంగీకారానికి సిద్ధంగానే వుంది కాని అతనామాట అనగానే నాలో ఏదో భయం కలిగింది. అమాయకమైన అతని మొహం చూస్తూ, నా హృదయపు లోతుల్లో దాగిన రహస్యములను తల్చుకుంటూ అతని మోహావేశానికి నా మనస్సు తల యొగ్గలేకపోయింది. నా గురించి అతనికేమీ తెలియదు. తెలుసుకోవాలని కూడా అతను కోరటంలేదు. అతను పురుషుడు. నన్ను తన విలాస వస్తువుగా భావించి నా ప్రేమతో చెలగాటమాడి చివరకు నన్ను నిర్భాగ్యురాలిని చేయగలడు. నా సౌందర్యం అతనిలో మోహోద్రేకం కల్గిస్తోంది. కాని అది నన్ను అథఃపాతాళానికి తోసెయ్యగలదు. పురుషుడి చేతిలో కీలుబొమ్మ స్త్రీ. అందులోనూ నాలాటి అనాధ, ఎవరిదగ్గరనుండైనా ఆదరాన్ని ఆశించడం కేవలం భ్రమపడడమే” అంది విచారంగా.

పంకజమ్మ “రేఖా! నువ్వంటున్నదేమిటో నాకు బోధపడడంలేదు. వేణు ప్రేమించాడనీ అంటున్నావు. వేణు నిన్ను మోసం చేస్తాడేమో

ఆంధ్రా టెలిగ్రాఫ్ & వైర్‌లెస్ ట్రయినింగ్ కాలేజి, పొత్తూరివారి తోట, గుంటూరు-1.
[స్థాపితము : 1957]
PUC; SSLC; and MATRIC పాస్ (or) ఫెయిల్ విద్యార్థి, విద్యార్థినులకు : టెలిగ్రఫిస్టులు, సిగ్నలర్సు, అసిస్టెంట్ స్టేషన్ మాసర్లు, టెలిఫోన్ ఆపరేటర్లుగను రైల్వే, పోస్టు& టెలిగ్రాఫ్స్, ఇతర సంస్థల్లో ఉద్యోగాలు చేయుటకు శిక్షణయివ్వబడును.
శిక్షణకాలం 2 నెలలు - టెలిఫోన్ ఆపరేటర్లుగా శిక్షణ పొందుటకు 30 రోజులు మాత్రమే. హాస్టలు వసతులు గలవు - మెరిట్ స్కాలర్ షిప్స్ గలవు. విద్యార్థినులకు ప్రత్యేకమైన కాలేజి, హాస్టలు వసతులు గలవు.
పూర్తి వివరములకు 50 N.P. పంపవలెను.

RATNAM'S N-OIL
అంగవరములు బలహీనతి చెంది, చిన్న దినచో తిరిగి యథాప్రకారం అయి పూర్తి సౌఖ్య మనుభవించుటకు 50 సం॥ ప్రఖ్యాతి కలది. 1 సీసా రూ. 10 లు వి. పి. 1-4-0 కావలసినవారు ముందుగా 1-4-0 పంపేది. ఇందులో స్పెషల్ రకం అర్జంటుగుణమునకు రూ. 25-0-0 లు.
డాక్టర్. రత్నం సన్స్, (Estd 1904 మలక్ పేటబిల్డింగ్స్. ఆజంపురాగాము గేటు వద్ద, హైదరాబాద్-24 (ఆంధ్రప్రదేశ్)




# నర్తకి

అని భయపడుతున్నావు. 'నీకు ఎప్పుడైనా, ఎవరి వల్లనైనా మోసం జరిగిందా?'' అని ప్రశ్నించింది.

రేఖ ''అవును ఆ విషయమే మీతో చెప్పడానికి వచ్చాను. ఆ విషయం చెప్పక తీరని సమయం కూడా వచ్చింది. ఈ కథ మీకు మొదటినుంచీ చెప్తాను. మాది రాజమండ్రీ దగ్గర ఒక పల్లెటూరు. ఆ వూళ్ళో మా తాతయ్య బాగా డబ్బున్న రైతు. మా అమ్మను బాగా కట్నమిచ్చి, చదువుకున్నాయన కిచ్చి పెళ్ళి చేశారు. మా అమ్మ మూడేళ్ళు కాపరం చేసిన తరవాత నేను పుట్టడం మా నాన్న గారు చనిపోవడం రెండూ ఒకసారే జరిగాయి. అప్పటినుంచీ మా అమ్మ నన్ను తీసుకొని మా తాతయ్య వద్దకు వచ్చేసింది. తండ్రిలేని పిల్లనని నన్ను చిన్నప్పటినుంచీ చాలా గారాబంగా పెంచారు. మా వూళ్ళోవున్న ఎలిమెంటరీ స్కూల్లో నన్ను చదవవేశారు.''

''ఆ వూరి స్కూలుకు ఒక స్త్రీని టీచరుగా వేసారు. ఆమెకు డాన్సింగంటే చాలా ఇష్టం. చదువు చెప్పినా చెప్పకపోయినా స్కూల్లోవున్న ఆడపిల్లలకు విధిగా డాన్సు నేర్పి వాళ్ళచేత పాటలు పాడిస్తూ, డాన్సు చేయించేది. పైగా నెలకొకసారిగాని రెండు నెలల కొకసారిగాని మాకు వేషాలువేసి, స్టేజి తయారు చేయించి వూళ్ళో వాళ్ళందర్నీ పిలిచి వాళ్ళముందు మాచేత ప్రదర్శనాలు జరిపించేది. చిన్న పిల్లల ఆటల్నీ పాటల్నీ చూసి అంతా సంతోషిస్తూండేవారు. అందరూ ఆమెను చాలా అభినందించేవారు.

నాకు పదేళ్ళు వయస్సు వచ్చాక ఆమె ఆ వూరు వదిలి వెళ్ళిపోయింది. మరొక మగ మేష్టారు వచ్చారు. ఆయన రెండు సంవత్సరాలు వున్నారు. మా వూళ్ళో అయిదవ క్లాసు దాకానే ఉంది. ప్రక్క వూళ్ళో హైస్కూలు ఉంది. మా వాళ్ళు నా చదువు అయిదవ క్లాసుతో అంతం చేద్దామనుకున్నారు. కాని నేను పై చదువు చదువుతానని పట్టుపట్టి బాగా ఏడ్చి, అన్నం తినకుండా రెండు రోజులు గొడవచేసేసరికి ఒప్పుకున్నారు. రోజూ నేనూ ఆడా, మగా పిల్లలు కలిసి మూడు మైళ్ళ దూరంలో వున్న ప్రక్క వూరికి వెళ్ళి చదువుకొనేవాళ్ళం. నేను ఫిఫ్తుఫారం చదువుతున్న రోజుల్లో మా స్కూలు వార్షిక దినం జరిగినప్పుడు నాచేత డాన్సు చేయించారు. ఆనాడే నాకు ఆనంద్ అనే యువకునితో పరిచయమైంది. అతను ఆ వూరి వాడే. కాని పైవూళ్ళో కాలేజీలో చదువుతున్నాడు. సెలవలకి ఇంటికి వచ్చాడు. రోజూ ''స్కూలునుంచి నేను తిరిగి వచ్చే సమయానికి నన్ను కలుసుకొని మా వూరుదాకా నాతో వచ్చేవాడు.

పదిహేనురోజుల్లో ఆనంద్ నాతో చాలా చనువుగా మాట్లాడడం ప్రారంభించాడు. అతనికి ఇరవై ఏళ్ళుంటాయి. అతనిని కలుసుకోవడం నాకూ చాలా సంతోషంగా ఉండేది. ఒకనాడు బడినుంచి నేను రావడం ఆలస్యమైంది. నాతో మా వూరునుంచి చదువుకోడానికి పెద్ద క్లాసులకి ఆడపిల్ల లెవరూ రాకపోవడంవలన నేను ఒక్కర్తినే వస్తూ వెళ్తూ వుండేదాన్ని. ఆవాళ సాయంకాలం ఆనంద్ నన్ను దిగబెట్టటానికి వచ్చాడు. బాగా చీకటి పడింది. పొలాల గట్లవెంట ఇద్దరం కలిసి నడుస్తున్నాం. ఆనంద్ నన్నొకచోట ఆపాడు. చీకటి బాగా వ్యాపించింది. తన ప్రేమను నాకు తెలియబరుస్తూ, ఆనంద్ నన్ను తన చేతుల్లోకి తీసుకున్నాడు. గట్టిగా ముద్దు పెట్టుకున్నాడు. నేను కూడా అతనితో, తనను ప్రేమిస్తున్నానని చెప్పాను. ఇద్దరం ఒకరి నొకరు గాఢంగా కౌగలించుకొన్నాం. మేము ఒకరి ప్రేమ నొకరికి తెలియబర్చుకుంటూ, అజాగ్రత్తగాఉన్న సమయంలో చీకటి పడిందని నాకోసం వెతుక్కుంటూ వస్తున్న తాతయ్యకంట పడ్డాం. తాతయ్య కోపం పట్టలేకపోయాడు. కాని పైకి ఏమీ అనకుండా నన్ను తనతో ఇంటికి తీసుకువెళ్ళాడు.''

''ఆనాటినుంచీ నన్ను బయటికి వెళ్ళనీకుండా తాతయ్య కట్టుదిట్టం చేసాడు. కాని ఆనంద్ మా యింట్లో పనిమనిషిని మంచి చేసుకొని ఆమె ద్వారా, రహస్యంగా ప్రేమ లేఖలు పంపేవాడు. నేను కూడా జవాబులు రాసి పంపేదాన్ని. అతను ఆ లేఖల్లో తన ప్రేమని చాలా ఉద్రిక్తతతో వ్యక్తం చేసేవాడు. ఇద్దరం ఒకర్ని విడిచి ఒకరం వుండలేమని నిశ్చయించుకున్నాం. అతను నన్ను తనతో వచ్చెయ్యమనీ, ఏ వూరైనా వెళ్ళిపోయి పెళ్ళి చేసుకుందామని రాస్తుండేవాడు. చివరికి ఒకనాడు మా తాతయ్య వూర్లో లేని సమయంలో స్నేహితురింటికి వెళ్ళివస్తానని చెప్పి వెళ్ళి వూరి వెలుపల నా కోసం ఎదురు చూస్తున్న ఆనంద్‌ను కలుసుకున్నాను.''

''ఇద్దరం రాజమండ్రీవెళ్ళి అక్కడనుంచి సరాసరి మద్రాసు వచ్చేశాం. ఇక్కడ ఒక హోటల్లో గది అద్దెకు తీసుకొని రెండు రోజులు హాయిగా గడిపాం. అక్కడనుంచి తిరుపతివెళ్ళి ఇద్దరం పెళ్ళి చేసుకుందామని అనుకున్నాం. ఆనంద్ తనతో చాలా డబ్బు తెచ్చాడు. డబ్బంతా నా దగ్గరే వుంచాడు. అయిదు వందలదాకా వుంటుంది. అప్పటికి నా చేతిలో వున్న డబ్బు. మూడవనాడు సాయంకాలం ఆనంద్, ఎవర్నో తనకు తెలిసిన వ్యక్తిని కలుసుకుని అరగంటలో వస్తానని మరి రాలేదు.''

''నేను ఒక్కర్తినీ అతనికోసం ఎదురు చూస్తూ ఆ హొటల్లో వారం రోజులు గడిపాను. ఆనంద్ జాడే లేదు. ఆడది ఒంటరిగా వుండడం ఎంత ప్రమాదకరమో ఆవారం రోజుల్లో నాకు చాలా వరకూ అర్థమైంది. ఆవారం రోజులూ నేను పడ్డ బాధ వర్ణనాతీతం. హృదయంలో ఆనంద్ చేసిన మోసం బాధిస్తోంది. నేను తిరిగి మా వూరు వెళ్ళలేను. ఎందుకంటే మా తాతయ్య చండశాసనుడు. నలుగురిలో పరువుగా బ్రతుకుతున్న వాళ్ళని అమర్యాదాపాలు చేసి వచ్చాను. ఇహ ఏ మొహం పెట్టుకొని వాళ్ళ దగ్గరకు వెళ్ళగలను? పోనీ ఇక్కడ వుందామని నిశ్చయించుకుందామంటే ఈ వూరు కొత్త. ఒంటరిదాన్ని.''

''ఆ హోటలు యజమాని నా స్థితి తెలుసుకొని, ఆనంద్‌కోసం వూరల్లా రెండు మూడు రోజులు వెతికించాడు. చివరకు లాభంలేదనీ, ఎవరైనా తెలిసినవాళ్ళవద్దకు వెళ్ళమనీ చెప్పాడు. అతని బిల్లు చెల్లించేసి బయటకువచ్చి రెండు రోజులు

ఆనంద్‌కోసం వూరంతా తిరిగాను. ఆ సమయంలో మీ నటరాజ నృత్య కళామందిర్ బోర్డుచూసి, మీరు, దీని అధిపతులని తెలుసుకొని స్త్రీన్ని కాబట్టి నన్ను మీవద్ద తల దాచుకోనిస్తారని ఆశతో మిమ్మల్ని కలుసుకున్నాను. తరువాత జరిగిన సంగతంతా మీకు తెలుసు. నానికృష్ట జీవితన్ని ఇన్నాళ్ళనుంచీ మీదగ్గర దాచాను. కాని నాయందు మీరు చూపుతున్న ప్రేమాభిమానాలు నన్ను ఈ విషయాలన్నీ మీతో చెప్పి, నన్ను మీరు ఆదరించినా, నిరాదరించినా స్వీకరించడానికి సిద్ధమయ్యేట్లు చేసేయి" అని ఆగింది రేఖ.

పంకజమ్మ తను విన్నదాని గురించి ఆలోచిస్తూ రెండు నిముషాలు వూరుకుంది. రేఖను పరిశీలించి చూసింది. చివరకు చిన్న నవ్వు నవ్వింది. "రేఖా నాకు నీ వ్యక్తిగతవిషయాలు తెలిపి, నన్ను నువ్వు కోరేదేమిటో నాకు తెలియటంలేదు. నీ గతం గురించి నాకు ఎట్టి దురభిప్రాయంలేదు. ప్రేమించినపురుషుడితో కలిసిరావడంలో తప్పేమీలేదు. ఇక అతను మోసగాడని తెలిసింది కాబట్టి నూతన జీవితం ఆరంభించావు. వేణు నిన్ను ప్రేమిస్తున్నాడు. వేణుని నీవు స్వీకరించగలిగితే అతనితో వివాహానికి అంగీకరించవచ్చు. ఇందుకు నీ గత చరిత్ర ఏ విధంగా అడ్డొస్తుందో నాకు బోధపడడంలేదు" అంది పంకజమ్మ.

రేఖ తన చేతిలోంచి చిన్న కాగితంతీసి పంకజమ్మ కిచ్చింది. అది తీసికొని పంకజమ్మ చదవసాగింది. అందులో ఇలా వుంది:

"ప్రియమైన రేఖకు !

మొన్న నీ నృత్యప్రదర్శనంనాడు నిన్ను చూసి చాలా ఆనందం పొందేను. మూడేళ్ళక్రితం నిన్ను ఒంటరిగా వదలి నేను వూళ్ళోకి వెళ్ళాను. తిరిగి రెండునెలల తరవాత ఆ హోటలువెళ్ళి విచారిస్తే నువ్వు నాకోసం వారం రోజుల దాకా ఎదురు చూశావనీ, తరవాత ఎక్కడికో వెళ్ళిపోయావనీ చెప్పారు. నువ్వు నా గురించి ఎంతో బాధపడివుంటావు. కాని విధి మనల్ని దూరం చేసింది. ఆనాడు నిన్ను వదలి హోటలు బయటకువచ్చి కొద్ది దూరం నడిచి వెళ్ళగానే ఒక కారువచ్చి నన్ను ఢీకొంది. వెంటనే స్పృహతప్పి పడిపోయాను. హాస్పిటల్లో రెండు నెలలు ఉండవలసివచ్చింది. నీకు కబురైనా పంపే స్థితిలో లేకపోయాను. గాయాలు చాలా బలంగా తగిలాయి.

ఈ మూడేళ్ళనుంచీ నీకోసం అన్వేషిస్తూ తిరుగుతున్నాను. నృత్యప్రదర్శన అవగానే నిన్ను కలుద్దామనుకున్నాను. కాని కొన్ని కారణాలవల్ల అది సాధ్యపడలేదు. రెండు రోజుల్లో నిన్ను వచ్చి కలుస్తాను. ఇట్లు నీ ఆనంద్"

పంకజమ్మ ఉత్తరం పూర్తిచేసి రేఖవైపు చూసింది. "ఆనంద్ నిన్ను ఎప్పుడు కలుసుకుంటాడనుకొంటున్నావు?" అని అడిగింది.

రేఖ "బహుశా రేపు కలియవచ్చు నా మనస్సులో మొదటినుంచీ ఆనంద్ తిరిగి వస్తాడని తోస్తూనేవుంది. వేణుయొక్క ప్రేమకు తగిన ప్రోత్సాహం అందుకే నే నివ్వలేదు. ఇద్దరూ నన్ను ప్రేమించారు. నా కిప్పుడేంచెయ్యాలో తెలియటంలేదు. ఇద్దరిలో ఎవరి మనస్సూ నొప్పించడం నా కిష్టంలేదు. ఇవాళ ప్రొద్దున్న ఈ ఉత్తరం అందింది. అప్పటినుంచి నా మనస్సు విపరీతమైన బాధ పడుతోంది. ఆనంద్ గతి ఏమయిందో తెలియక, అతను మళ్ళీ నా దగ్గరకు రానందుకు, అతణ్ణి వంచకుడిగా భావించి అతనికి ద్రోహం చేశానేమో? ననిపిస్తుంది. అనంద్ సంగతి వేణు దగ్గరదాచి వేణునీ మిమ్మల్నీ వంచించినందుకు కూడా నాకు కష్టంగా వుంది. ఇన్నాళ్ళబట్టి మీరు నన్ను ఎంతో ఆదరంగా చూసారు. కాని నేను వట్టి పతితననీ, వంచితననీ, మీ ప్రేమకు తగనిదాన్నని తెలిసి మీరు నన్ను తరిమెయ్యొచ్చు. కాని నా ప్రవర్తనకు నేను క్షమాపణ కోరుకుంటున్నాను" అని వెక్కి వెక్కి ఏడ్వసాగింది రేఖ.

తన ఉపన్యాసం వింటానికి వచ్చిన అశేషజనానికి బ్రహ్మాండంగా ఉపన్యాసం చెప్పి శ్రోతలవైపు తిరిగేసరికి ఒకే ఒక వ్యక్తి ఉండడంతో ఆశ్చర్యపోయినా "ఈ వ్యారి మొత్తానికి రసాస్వాదకుడు ఇతనొక్కడే" అనే సంతృప్తితో అతనిని కలుసుకున్నాడు ఆ ఉపన్యాసకుడు.

"ఎలా ఉందంటారు నా ఉపన్యాసం."

"ఇంటికిపోయి భార్యపోరు పడలేక ఇక్కడ కూర్చున్నాను. అయినా ఆ బాధ కంటె ఈ బాధే బాగుంది లెండి." అని సమాధానమిచ్చాడు.

కర్లపాలెం మధుసూదనరావు
(వేటపాలెం)

పంకజమ్మ రేఖ గడ్డాన్ని ఎత్తి ఏడుస్తున్న ఆమె మొహంలోకి దయార్ద్రదృష్టితో చూసింది. "రేఖా నీ తప్పేమిలేందే, నువ్వు అనవసరంగా బాధ పడుతున్నావు. నువ్వు నన్నుగాని, వేణునుగాని వంచించిన దేమీలేదు. నీ స్వభావం ఎంత మంచిదో, నీ హృదయం ఎంత సరళమైనదో నాకు తెలుసు. మానవ జీవితంలో అనేక పొరపాట్లు వస్తూంటాయి. అంతమాత్రాన ఆ వ్యక్తిని మనం తరిమెయ్యకూడదు. నువ్వూ ఆనంద్ ఎన్నో కలలు కనిఉంటారు. అయినా విధి మీ పథకాన్ని తలక్రిందు చేసింది. ఆనంద్‌తో నీబంధన తెగిపోయిందనుకున్నావు. వేణుతో నీ జీవితం పునర్నిర్మించుకుందామనుకున్నావు. కాని మళ్ళీ విధి నిర్ణయం నీ కెదురైంది. ఆనంద్ తిరిగి వచ్చాడు." పంకజమ్మ ఒక్క క్షణం ఆగింది.

రేఖ ఏడవ్వడం ఆపి పంకజమ్మ వైపు చూసి "మీరెంత మంచివారు. నామీద మీకున్న ప్రేమకు ఎంతో కృతజ్ఞురాలిని. నాకు ఆనంద్ వద్దు, వేణు వద్దు. నే నెప్పుడూ జీవితాంతం మీ దగ్గరే వుండిపోతాను. ఈ నాట్యకళను అభివృద్ధి చేసుకుంటూ మీ పాదసేవ చేస్తాను" అంది.

పంకజమ్మ చిన్న నవ్వు నవ్వింది. "రేఖా! జీవితం మనం అనుకున్నంత తిన్ననైనదీ, సుగమమైనదీ కాదు. మనస్సు చంచలమైనది. స్త్రీ మనస్సు చాలా బలహీనమైనది. నిన్ను ఆనంద్ ప్రేమతో లోబరుచుకున్నాడు. వేణుకూడా ప్రేమద్వారానే నీ హృదయాన్ని కదల్చగలిగాడు. వీళ్ళిద్దర్నీ వదిలిపెట్టగలిగితే మరొక పురుషుడు నిన్ను ప్రేమతో బంధించగలడు. కాబట్టి వీళ్ళనుంచి నువ్వు పారిపోగల్గుతా నన్నది వట్టి భ్రమే! వీరిద్దరిలో ఎవరో ఒకర్ని నువ్వు ఎంచుకొని వివాహం చేసుకోవలసిందే" అంది పంకజమ్మ.

రేఖ పంకజమ్మ చెప్పిన మాటల్ని శ్రద్ధగా వింది. ఆమె మాటలలో చాలా సత్యం వుంది. ఆమె అనుభవజ్ఞురాలు. ఈ మాటలు ఇంకెవరైనా అంటే తనకు కోపం వచ్చేది. అనంద్‌కు నాట్యం అంటే ఇష్టం వుందో లేదో తనకు తెలియదు. వేణు నర్తకుడు. నాట్యం అంటే అతనికి ఎంతో యిష్టం. అతనితో కలిసి తను కళారాధన నిర్విఘ్నంగా చేయగలదు. వేణు తను మెట్టినచోట పూజిస్తాడు. అతనికి తనంటే చాలా ఇష్టం. వేణు..

గది బయట చప్పుడైంది. వేణు లోపలికి వచ్చాడు. "అరె! ఇంత రాత్రప్పుడు మీ రిద్దరూ ఏం చేస్తున్నారు?" అని అడిగాడు. సన్నగా ఎర్రగా పొడుగ్గా యిరవైరెండేళ్ళ వయస్సుగల, చక్కని యువకుడు. సిల్కు పైజామా, సిల్కు బనియనుతో చేతిలో గోల్డుఫ్లేకు సిగరెట్టుతో రేగిన జుట్టుతో వేణు, రేఖకు ఎంతో అందంగా కనిపించాడు.

పంకజమ్మ "నువ్వెందుకు నిద్రపోలేదు?" అని అడిగింది మేనల్లుణ్ణి. వేణు రేఖవైపుచూసి చిరునవ్వు నవ్వాడు. రేఖ కూడా నవ్వింది. ఆమె మనస్సులో వేణంటే సద్భావం కలిగింది.

వేణు "నేను ఇంతవరకూ ఒక డిటెక్టివ్ పుస్తకం చదువుతూ మెలకువతో వున్నాను. నాకు ఆకలేసింది. నా ఫ్లాస్కులో టీ అయిపోయింది. నీ దగ్గర టీ బిస్కట్లు కూడా తీసుకుందామని వచ్చాను" అన్నాడు.

పంకజమ్మా రేఖా నవ్వుకున్నారు. రేఖకు తన విచారమంతా పోయింది. వేణు చిన్నపిల్లాడిలా మాట్లాడడం ఆమెకెంతో ఆనందం కలిగించింది. నిజంగా వేణులాంటివాడిని ఏ స్త్రీ ప్రేమించదూ? రేఖ, తను వేణును వివాహం చేసుకోవడంలో పొరబాటు చెయ్యబోననుకుంది.

**PAKCO** ప్యాక్కో స్లో-స్పీడ్, కోల్డు స్టార్టింగ్ క్రూడ్ ఆయిల్ ఇంజనులు

—: ప్రత్యేక లక్షణములు :—

* పనిచేయ ప్రారంభించుట తేలిక
* తక్కువ ఇంధన ఖర్చు
* క్రమమైన నడక
* దిట్టమైన నిర్మాణం
* ఎక్కువ మన్నిక
* అద్భుతంగా పనిచేయును
* బాస్క్ ఫ్యూయల్, ఇంజక్షన్ పరికరములు



మద్రాసు, ఆంధ్ర, కర్ణాటక, కేరళ రాష్ట్రములకు ఏజెంట్లు :

Grams: LAMP
Phone: 3617

**K. S. SHIVJI & CO,** (Estd 1903)
పోస్టుబాక్సు నెం. 5, 178-79 బ్రాడ్వే, మద్రాసు-1.



సుఖజీవిత సేవ

భారత "సిద్ధ వైద్య మహిమ" మన దేశ సిద్ధుల సాటిలేని కీర్తికి ఒక తార్కాణము.

"మేల్ మాయిల్ మందు"

ప్రపంచములో ప్రఖ్యాతి గాంచిన మేహ, కుష్ఠురోగనివారిణి భయంకరమైన మేహ వ్యాధివల్ల కష్టపడువారలను పునర్జన్మమిచ్చు అద్భుత సంజీవి మేహరోగ నివారిణి మాత్ర, లేహ్యము.

డా॥ కె. టి. కృష్ణమూర్తి ఆచార్రి & సన్సు

5/22, మేల్ మాయిల్. (P. O.) (N. A. Dt.) S. India.




అతి త్వరలో

కురుళ్లను బలపరచుటయే గాక, మనోహరమైన విడుపాటి నల్లని శిరోజములను పెంపొందించును. దీనిలో చేర్చిన ఔషధి సంపత్తివల్ల కేశములు ఊడిపోకుండగను, చుండ్రు లేకుండగను, నెరవకుండగను రీటా కాపాడగలదు.

రీటాను కొబ్బరినూనెలోగాని, మంచినూనెలో గాని కలిపి నిత్యం వాడండి. తప్పకుండా మీ కేశములు నల్లబడతాయి. దీనిని మీరు వాడి, మీ స్నేహితులకు కూడ సిఫార్సు చేయండి.



రీటా

అందమైన కేశ సంపదకు

రీటా కంపెని, మద్రాసు-1

R-STO

# నర్తకి

పంకజం మూడు కప్పులలో సాసర్లూ, ఫ్లాస్కూ, బిస్కట్లు టిన్నూ బయటకు తీసింది. ముగ్గురూ తెల్లవారుజాము నాలుగు గంటల దాకా టీ త్రాగుతూ, బిస్కట్లు తింటూ కబుర్లు చెప్పుకొని అప్పుడు పడుకోడానికి ఎవరి గదికి వారు వెళ్ళిపోయారు. రేఖ మనస్సు తేలికైంది. ఆమె మనస్సు వేణుతో నిండిపోయింది.

పొద్దున్న ఎనిమిది గంటలకు రేఖ రావడం, కాలకృత్యాలు తీర్చుకోవడం అన్నీ అయి నృత్య సాధనకు సిద్ధంగా వుంది. వేణు ఇంకా లేవలేదు. పంకజమ్మ కూడా రేఖలాగానే ప్రొద్దున్నేలేచి రాత్రి తను పూర్తి చేయకుండా వుంచిన వ్యాసాన్ని పూర్తి చేస్తోంది.

నటరాజ నృత్య కళామందిర్ భవనం గేటు దగ్గర కారాగింది. అందులోంచి ఒక యువకుడు తెల్లని సూటు వేస్కొని, మంచి జోళ్ళు, బంగారపు రిస్టువాచీ వ్రేలినున్న వజ్రపు టుంగరాలూ, అతన్ని భాగ్యవంతుడని తెలిపే లక్షణాలతో, బయటికి వచ్చాడు. భవనం లోపలికి వెళ్ళి తన కేదురు పడ్డ ఒక నౌకరును "రేఖ" ఎక్కడ? అని అడిగాడు.

రేఖ తన గది గుమ్మందగ్గర నిలబడివున్న ఆనందును చూసి "ఆనంద్! అంది. ఆనంద్ వచ్చి ఆమె చెయ్యి పట్టుకుని "రేఖా! టైంలేదు. పద! వెంటనే వెళ్ళిపోదాం. బయట కారు సిద్ధంగా వుంది. మధ్యాహ్నం రెండు గంటలకు మనం తిరుపతి కొండమీద వుండాలి. పెళ్ళికి అన్ని ఏర్పాట్లు చేసి వచ్చాను. ఇప్పుడు ఎనిమిదిన్నర గంటలయింది. మనం బజార్లో కొన్ని వస్తువులు కొనుక్కోవాలి పద. మీ నాట్యమందిర్ యజమాని దగ్గర సెలవు తీసుకొని వెళ్ళిపోదాం. ఆమె రూము ఎక్కడ?" అని అంటూ ఆమెను నడిపించుకుంటూ బయటకు తీసుకువచ్చాడు.

పంకజమ్మ, రేఖ "ఇతనే ఆనంద్" అని చెప్పినప్పుడు ఆశ్చర్యపోయింది అతన్ని చూసి. ఆనంద్ చాలా సహజంగా "మీకు చాలా థాంక్స్. మే మిద్దరం ఇవాళ మధ్యాహ్నం రెండు గంటలకు వివాహం చేసుకోబోతున్నాం. రేఖ కేమీ తెలియదు. అంతా నేనే ఏర్పాటు చేసాను. రెండు రోజుల్లో తిరిగి వస్తాం. రేఖా! నువ్వేమీ తీసుకురానక్కరలేదు. ముందు కారు దగ్గరకి పద....." అంటూ రేఖను తన చేతితో తీసికెళ్ళిపోతుంటే, పంకజమ్మ చిరునవ్వు నవ్వుకుంది. రేఖయొక్క సంతోషపూరిత ముఖాన్ని జ్ఞప్తికి తెచ్చుకుంటూ. బయట కారు కదలిపోయింది.

కారులో ఆనంద్, రేఖతో "ఈ మూడేళ్ళలోనూ నువ్వు ఇంకా బాగా అందంగా తయారయ్యావు "సుమా!" అన్నాడు. రేఖ తెచ్చుకున్న కోపంతో "నువ్వు ఈ మూడుడేళ్ళలోనూ ఇంకా కొంటెగా తయారయావు తెలుసా?" అంది. ఇద్దరూ నవ్వుకున్నారు. ★